సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 5 । మార్చి । 2023



ఈ సారైనా నెరవేరేనా..?
కేంద్రం తెచ్చిన ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం లక్ష్యం నెరవేరటం లేదు. 8లో



డీసీసీబీలో రూ.2,710 కోట్లు..
రూ.2,710 కోట్ల లావాదేవీలతో డీసీసీబీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని చైర్మన్ నాగభూషణం పేర్కొన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 19°

వాతావరణం
జిల్లాలో ఆదివారం పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలి

బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరుటౌన్: బీటీపీఎస్‌ను ప్రమాద రహిత ప్లాంట్‌గా తీర్చిదిద్దాలని సీఈ బి.బిచ్చన్న సూచించారు. శనివారం పవర్ ప్లాంట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ హాల్‌లో జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికులకు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 10 తేదీ వరకు బహుముఖ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు టి. శ్రీనివాసరావు, రమేష్‌బాబు, బి. పార్వతి, బి.సత్యనారాయణ, రామ్మోహన్‌రావు, రాంప్రసాద్, శ్రీనివాసరావు, బాబూరావు, అజిత్ పర్మర్, జి ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని హామీలు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్: ఎన్నికల హామీలు అమలుకు నోచుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదల సొంతింటి కల నెరవేరడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. ఇళ్లు లేని పేదలు లక్షల్లో ఉంటే వేలల్లో నిర్మాణాలు చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మదన్‌సింగ్, సర్పంచ్ బండి రమేష్, ఎంపీటీసీ పద్మావతి, నాయకులు కొమారి హన్మంతరావు, కందుల భాస్కర్, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, బాగం శేషభూషణం, ముక్కెర మురళి, పాదిల శ్రీనివాస్, టి.ధర్మారావు, మల్సూర్, కె.శంకర్, కొమారి కృష్ణ, కొండపల్లి నరేష్, ఆకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త మండలాలు సాధించేవరకు ఉద్యమం


న్యూడెమోక్రసీ నాయకుల పాదయాత్ర, సంఘీభావంగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్

ఇల్లెందురూరల్: కొమరారం, బోడు నూతన మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పేర్కొన్నారు. నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ డిమాండ్‌తో న్యూడెమోక్రసీ చేపట్టిన పాదయాత్ర శనివారం మండలంలోని మర్రిగూడెం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రకు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సంఘీబావం ప్రకటించి సభలో మాట్లాడారు. కొత్త మండలాల డిమాండ్ న్యాయసమ్మతమైనదని పేర్కొన్నారు. చింతు ఉదయ్ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్‌లు చింత రజిత, మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, వాంకుడోత్ శ్రీను, సరోజిని, పాయం స్వాతి, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీ పూనెం సురేందర్, న్యూడెమోక్రసీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, మోతీలాల్, మిట్టపల్లి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు కోరం సురేందర్, ముక్తి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, తాటి బిక్షం పాల్గొన్నారు.

పాలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

కూసుమంచి: సాగర్ డ్యాం నుంచి పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. రిజర్వాయర్‌కు ఇప్పటివరకు 2,500 క్యూసెక్కుల నీరు చేరుతుండగా శనివారం 5,154 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం 19 అడుగులకు చేరింది. రిజర్వాయర్ నుండి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు 4,430 క్యూసెక్కులు, పాలేరు కాల్వకు 181 క్యూసెక్కులు వదులుతున్న అధికారులు మిషన్ భగీరథ ప్రాజెక్టుకు మరో 125 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. రిజర్వాయర్‌కు సాగర్ నుండి వచ్చే నీటి ప్రవాహం పెరగటంతో త్వరలోనే నీటిమట్టం 23 అడుగులకు చేరనుంది.

నాన్న కల.. నా లక్ష్యం

ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న భద్రాద్రి వాసి మౌనిక

- తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ హోంశాఖ ఆదేశాలు
- ఫార్మసీతో మొదలై పోలీసింగ్ వైపు దృష్టి
- ప్రతీ అడుగులో అండగా నిలిచిన తండ్రి రామ్‌కుమార్
- అమ్మాయిలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారంటున్న తల్లి


తల్లిదండ్రులు రామ్‌కుమార్ - వాణీకుమారితో మౌనిక



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సివిల్ సర్వీసెస్–2021 బ్యాచ్ ఐపీఎస్‌ల శిక్షణ ఇటీవల పూర్తి కాగా, కేంద్ర హోంశాఖ ఏడుగురిని తెలంగాణకు కేటాయించింది. ఇందులో భద్రాచలం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పోరిక వాణీకుమారి – రామ్‌కుమార్ దంపతుల కుమార్తె మౌనిక కూడా ఉన్నారు. సొంత రాష్ట్రంలోనే పోలీస్ అధికారిగా సేవలు అందించే అవకాశం రావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్న ఆమె... సివిల్స్ సాధించే క్రమంలో స్ఫూర్తిగా నిలిచిన అంశాలు, ఎదురైన సవాళ్లు తదితర అంశాలను శనివారం 'సాక్షి'కి వివరించారు.

● ఆ బాధ కనిపించేది..

నాన్న రామ్‌కుమార్‌కు చిన్నప్పటి నుంచి ఐపీఎస్ కావాలనే కోరిక బలంగా ఉండేది. ఇంజనీరింగ్ పూర్తి కాగానే ఉద్యోగం రావడం ఆ వెంటనే పెళ్లి జరిగాయి. అయినప్పటికీ సివిల్స్‌కు ప్రయత్నించారు. అయితే మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లినా సివిల్స్ సాధించలేక పోయారు. ఆయనతో చదువుకున్న వారిలో కొందరు సివిల్స్‌కు ఎంపికయ్యారు. దీంతో నేను కానీ తమ్ముడు మోహిత్ కానీ సివిల్స్‌కి ఎంపిక కావాలంటూ మాకు ఎప్పుడూ చెబుతుండేవారు. కానీ తమ్ముడు కెరీర్‌గా బిజినెస్‌ను ఎంచుకున్నాడు. మా కుటుంబం నుంచి ఎవరూ సివిల్స్ వైపు వెళ్లలేదనే బాధ నాన్నలో తరచుగా కనిపించేది. దీంతో జర్మనీ నుంచి తిరిగి వచ్చాక సివిల్స్ వైపు వెళ్లాలని నేను గట్టిగా నిర్ణయించుకున్నా.

సండే స్పెషల్

● చదువంతా హైదరాబాద్‌లోనే

మా నాన్న రామ్‌కుమార్ హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో ఇంజనీర్‌గా పనిచేసేవారు. దీంతో మా ఫ్యామిలీ అక్కడే ఉండేది. స్కూలింగ్ నుంచి కాలేజ్ వరకు చదువు అంతా హైదరాబాద్‌లోనే పూర్తిచేశా. అమ్మ భద్రాచలంలో వ్యాపారాలు చూసుకుంటూ ఇక్కడే ఉండటంతో తరచుగా వచ్చివెళ్లేదాన్ని ఇంటర్ తర్వాత ఎంబీబీఎస్ చేసి డాక్టర్ అవాలని ముందుగా అనుకున్నా. చివరి నిమిషంలో ఫార్మసీ వైపు వెళ్లాను. ఫార్మసీ పూర్తి చేసిన తర్వాత మెడిసిన్ రీసెర్చ్ కోర్సు కోసం రెండేళ్లు జర్మనీలో ఉన్నాను. ఫార్మసీలోనే స్థిరపడిపోదాం అనుకున్నాను.

● పెళ్లి చేసేయండి అన్నారు..

సివిల్స్ మూడు సార్లు విఫలమయ్యాక 'ఇంకెన్నాళ్లు అమ్మాయిని చదివిస్తారు. త్వరగా పెళ్లి చేసేయండి' అంటూ అమ్మానాన్నలు ఎక్కడకు వెళ్లినా బంధువుల నుంచి ఒత్తిళ్లు వచ్చేవి. దీంతో ఫ్యామిలీ ఫంక్షన్లకు కూడా వెళ్లలేదు. పూర్తిగా సివిల్స్‌పైనే దృష్టి సారించాను.

● అడ్డంకులు కావు

ఇంటర్నెట్‌లో విజ్ఞానం, కావాల్సిన సమాచారం విరివిగా అందుబాటులో ఉంది. భద్రాచలమైనా, హైదరాబాదైనా ఒక్కటే. మనం ఎక్కడి నుంచి వచ్చాం.. మనది ఏ ప్రాంతం అనే అంశాలతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో పట్టుదలగా ప్రయత్నిస్తే ఎవరైనా ఎలాంటి లక్ష్యాలను అయినా సాధించవచ్చు.

● సొంతంగానే ప్రిపేర్ అయ్యా

ఇంటర్నెట్‌లో ఉన్న మెటీరియల్, యూట్యూబ్‌లో ఉన్న నిపుణుల వీడియోలతో సొంతంగానే సివిల్స్‌కు ప్రిపేర్ అవడం మొదలెట్టాను. బయట ఎక్కడా కోచింగ్ సెంటర్లకు వెళ్లలేదు. అప్పటికే నాన్నకు సివిల్స్ పరీక్షలు రాసిన అనుభవం ఉండటం వల్ల నోట్స్ రాసుకోవడంలో వల్ల ఆయన గైడ్ చేసేవారు. మొదటి మూడు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్, మెయిన్స్ దాటి నా ఇంటర్వ్యూల్లో వెనుకబడిపోయాను. దీంతో వివాహం జరిపించాలని మా అమ్మానాన్నలపై ఒత్తిడి వచ్చేది. అయినా పట్టువీడకుండా మరో రెండు ప్రయత్నాలు చేసి ఇంటర్వ్యూ వరకు వెళ్లినా విజయం దక్కలేదు. వరుసగా ఐదు సార్లు విఫలం కావడంతో స్నేహితులు, బంధువుల నుంచి ఒత్తిడి మరింత ఎక్కువైంది. ఎవరేమనుకున్నా.. నా లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోకూడదని నిర్ణయించుకున్నాను. సివిల్స్‌కి ప్రిపేర్ అవడంలో అప్పటికే వచ్చిన అనుభవం, నాన్న ఇచ్చిన సలహాలతో ఆరో ప్రయత్నంలో సక్సెస్ అయి ఐపీఎస్‌కు ఎంపికయ్యాను.

ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు..

అమ్మాయిలకు అరకొరగా చదువు చెప్పించడం, ఆ తర్వాత పెళ్లి, భర్త, పిల్లలే లోకం అన్నట్టుగా ఉంది కొన్నిచోట్ల పరిస్థితి. కానీ అమ్మాయిలకు అండగా ఉంటే వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తే ఎంతో ఎత్తుకు ఎదుగుతారు. కన్న తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి పేరు తెస్తారని చెప్పేందుకు మౌనిక ఉదాహరణ. – పోరిక వాణీకుమారి, మౌనిక తల్లి

ఉత్సవ శోభ..


వెలుగులు విరజిమ్ముతున్న ఆలయం

- నేటి నుంచి శ్రీబాలాజీ వార్షిక బ్రహ్మోత్సవాలు
- 7న వెంకటేశ్వరస్వామివారి కల్యాణం
- వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగే వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. 7న స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. కల్యాణ మండపం వద్ద క్యూ లైన్లు, తాగునీటి వసతి, వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు.

చారిత్రక నేపథ్యం..

కాకతీయుల సామ్రాజ్యంలో సేనానిగా పనిచేసిన అన్నపురెడ్డి ఈ ప్రాంతానికి వచ్చి, ఇక్కడి ప్రశాంత వాతావరణం చూసి శ్రీవారిని ప్రతిష్ఠించారు. శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి కైంకర్యాల నిమిత్తం గ్రామంలో రాయుడు చెరువు, నల్లచెరువులను నిర్మించి కొంత భూమిని దానం ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. సేనాని పేరుతోనే గ్రామానికి అన్నపురెడ్డిపల్లి అనే పేరు వచ్చిందని ప్రతీతి. స్వామివారికి ఇక్కడ 2,300 ఎకరాల భూమి ఉండటం విశేషం.

సంతాన బాలాజీగా పేరు..

స్వామివారు సంతాన బాలాజీగా పేరుగాంచారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడ ప్రసాదం స్వీకరించేందుకు సంతానంలేని భక్తులు భారీగా వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న కాశ్లారి వంశస్తుడు శ్రీవెంకటప్పయ్యామాత్యుడు సంతానం కోసం స్వామి వారిని పూజించగా నలుగురు సంతానం కలిగారు. దీంతో కాశ్లారి వంశస్తులు 1870వ సంవత్సరంలో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు కాశ్లారి జోగారావు రచించిన 'రాజధర్మ ప్రకాశిక' పుస్తకం ద్వారా తెలుస్తోంది. 1969 నుంచి దేవాదాయ శాఖ ఆలయాన్ని పర్యవేక్షిస్తోంది. 1974లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సహాయ సహకారాలతో ఆలయ సొంత నిధులు రూ.18 లక్షలు వెచ్చించి మహామండపం, ప్రాకార మండపం, నలుదిక్కులా నాలుగు అతి పెద్ద గోపురాలతో నిర్మాణం చేపట్టారు. 1980లో ఆలయ పునఃనిర్మాణాన్ని పూర్తి చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం స్వామి వారికి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాదులను ఘనంగా జరిపిస్తున్నారు.


స్వామి వారి మూలవిరాట్

వేడుకలు ఇలా..

తొలి రోజు ఆదివారం సాయంత్రం ఆరాధన, విష్వక్సేనారాధన, పుణ్యావాచనం రక్షాబంధనం, రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురారోహనం, యాగశాల ప్రవేశం, నివేదన, తీర్థప్రసాదగోష్టి, 6న సుప్రభాతసేవ, బాలభోగ నివేదన, అగ్నిప్రతిష్ఠ, కుంభస్థాపన, ధ్వజారోహణం నిర్వహిస్తారు. గరుడ ప్రసాదం అందజేస్తారు.7న రాత్రి 10 గంటలకు స్వామి వారి తిరుకల్యాణం, గజవాహన సేవ, అమ్మవార్లకు పల్లకిసేవ, ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణం, 8న రథోత్సవం, దొంగల దోపు ఉత్సవం, 9న ఊంజల్ సేవ, దీపోత్సవం, 10న ధ్వజావరోహణం, స్వామి చక్రస్నానం, శృంగార డోలనోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల రాకపోకలకు టీఎస్‌ఆర్టీసీ సత్తుపల్లి, కొత్తగూడెం డిపోల నుంచి అన్నపురెడ్డిపల్లికి బస్సులు నడుపనుంది.

రామయ్యకు సార్వభౌమ సేవ


సార్వభౌమ వాహనంపై రామయ్య తిరువీధి సేవ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో రామయ్య స్వామికి శనివారం రాత్రి సార్వభౌమ సేవ ఘనంగా జరిగింది. ప్రవాసాంధ్ర భక్తులు నూతనంగా ఆలయానికి అందించిన సువర్ణ తాపడ ద్వాదశ వాహనాల ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శనివారం ఈ వేడుకను వైభవోపేతంగా జరిపారు. భక్తులు అందచేసిన సార్వభౌమ వాహనంపై రామయ్య జగదభిరాముడిగా ఆశీనులై కనువిందు చేశారు. మేళతాళాల నడుమ దేవస్థానం నుంచి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. నూతన వాహనంపై ఇళ్ల ముందుకు వచ్చిన స్వామి వారికి దారిపొడవునా భక్తులు కొబ్బరికాయలు కొడుతూ జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్, కార్గో ద్వారా తలంబ్రాలు

శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను పోస్టల్, కార్గోల ద్వారా భక్తులకు అందచేయాలని ఆలయ అధికారులు నిశ్చయించారు. రెండు ముత్యాలతో రూ.30 ధర నిర్ణయించి, ఆయా శాఖల ద్వారా అందిస్తామని, రవాణా చార్జీలు అదనమని అధికారులు తెలిపారు. శ్రీరామనవమి రోజు అంతరాలయంలో మూలమూర్తుల వద్ద అర్చన చేసి తలంబ్రాలను పంపించే సేవకు రూ.330 ధర నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కాగా వివరాలను ఆలయ అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

పెండింగ్ 'క్రమబద్ధీకరణ'పై విచారణ

- ముగ్గురు అధికారులతో కమిటీని నియమిస్తాం
- కలెక్టర్ అనుదీప్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పారదర్శకంగా విచారించేందుకు ముగ్గురు అధికారులతో కమిటీని నియమించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, డీఆర్‌డీఓ, ఉద్యాన, వ్యవసాయ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 59 ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 47, జీఓ నంబర్ 76 ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 98 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీఓ 59 ప్రకారం 358 స్థలాలకు మార్కెట్ విలువ ప్రకారం చెల్లింపులు చేయాలని డిమాండ్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. యజమానులు నిధులు చెల్లిస్తేనే పట్టాలు జారీ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు వార్డుల వారీగా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈసారి హరితహారంలో నర్సరీలు, అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన మొక్కలే నాటాలని, బయట నుంచి కొనుగోలుకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. వేసవిలో మొక్కల సంరక్షణకు వారంలో మూడురోజులు నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 16,860 ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 14,003 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, వ్యవసాయాధికారి అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, డీపీఓ రమాకాంత్, ఇల్లెందు డీఎఫ్‌ఓ నీరజ్ కుమార్, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, పాల్వంచ, ఇల్లెందు తహసీల్దార్లు రంగాప్రసాద్, కృష్ణవేణి పాల్గొన్నారు.

వీసీకి హాజరైన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వైద్యసేవలు, కంటి వెలుగు, మహిళా స్వయం సంఘాలకు వడ్డీలేని రుణాల మంజూరు తదితర అంశాలపై రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖా మంత్రి హరీష్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

పోడుపై అయోమయం!

- ఫిబ్రవరిలోగా పట్టాలిస్తామని ప్రకటించిన సీఎం
- మార్చి వచ్చినా ఇంకా ప్రారంభంకాని ప్రక్రియ
- పంపిణీపై స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు
- పోడు సాగుదారులకు మళ్లీ ఎదురుచూపులేనా?


గ్రామసభలో పోడు దరఖాస్తులపై చర్చిస్తున్న అధికారులు (ఫైల్)

చుంచుపల్లి: ఫిబ్రవరి నెలాఖరుకు పోడు భూముల పట్టాల పంపిణీ ప్రక్రియ చేపడతామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన చేసినా ఇంకా కార్యరూపం దాల్చడంలేదు. ప్రకటన గడువు ముసిగినా పట్టాలు పంపిణీ ప్రారంభంకాకపోవడతో పోడు సాగుదారులకు మళ్లీ నిరీక్షణ తప్పడం లేదు. అధికారులు కూడా స్పష్టత ఇవ్వలేకపోతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

హక్కు పత్రాలు సిద్ధం చేశాక జాప్యం..

సీఎం కేసీఆర్ ప్రకటనతో జిల్లా అధికార యంత్రాంగం ఆగమేఘాల మీద ఫిబ్రవరిలో దాదాపు 3 వారాలపాటు పోడు దరఖాస్తులపై రాత్రింబవళ్లు తీవ్రంగా కసరత్తు చేసింది. అధికారులు ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించారు. ప్రస్తుతం పోడు సాగులో ఉన్న గిరిజనులందరికీ అవకాశం కల్పిస్తూ, పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు హక్కు పత్రాలను సిద్ధం చేశారు. అర్హుల గుర్తింపు పూర్తికావడంతో జిల్లా కమిటీ ఆమోదముద్ర వేస్తే ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొద్దిరోజులుగా ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో అయోమయం నెలకొంది. సీఎం ప్రకటించిన గడువు దాటిపోయినా పట్టాల జారీ విషయమై అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేదు. మరోవైపు సాగుదారులు పట్టాల పంపిణీపై ప్రభుత్వ తదుపరి ప్రకటన కోసం ఆశగా నిరీక్షిస్తున్నారు.

రెండోసారి కసరత్తు తర్వాత..?

పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం 2021లో దరఖాస్తులు స్వీకరించింది. అంచనాలకు మించి అర్జీలు రావడంతో అధికారులు పరిశీలన చేపట్టారు. వాస్తవంగా సాగులో ఉన్నవారే దరఖాస్తు చేసుకున్నారా...ఇతరులు దరఖాస్తు చేసుకున్నారా? తదితర అంశాలను పక్కాగా పరిశీలించారు. ఆ తర్వాత గ్రామసభల్లో అనుమతించిన దరఖాస్తులను ఎస్‌డీఎల్‌సీకి పంపారు. సబ్ డివిజనల్ కమిటీ జాబితాపై అధికారులు జనవరిలోనే కసరత్తు పూర్తి చేశారు. అర్హులను గుర్తించారు. ఆ తర్వాత కొన్ని నిబంధనలు పక్కన పెట్టాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు రావడంతో దరఖాస్తులపై మళ్లీ కసరత్తు జరిగింది. చివరకు 2005 తర్వాత కూడా పోడు సాగులో ఉన్న గిరిజనులందరికీ పట్టాల పంపిణీలో అవకాశం కల్పించారు. దీంతో మొదట జిల్లాలో 30,684 ఎకరాల పరిధిలో 11,532 దరఖాస్తుదారులను ఫైనల్ చేశారు. మరోసారి కసరత్తు అనంతరం ఆ సంఖ్య ఏకంగా 44 వేల మందికి చేరింది. వీరికి 1.25 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించాల్సి ఉంది. రెండోసారి కసరత్తు తర్వాత ప్రక్రియ ఆగిపోయిందా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా భద్రాద్రి జిల్లాలోనే అత్యధికంగా పోడు పట్టాలు పొందనున్నారని అధికారులు చెబుతున్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవాలి



జిల్లాలో వేలాది మంది గిరిజనులు పోడు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ ఫిబ్రవరి చివరి నాటికి పోడు పట్టాల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదు. సీఎం పోడు పట్టాలను పంపిణీలో జాప్యం చేయకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
– వాసం రామకృష్ణ, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్

దరఖాస్తుల ఆహ్వానం


కొత్తగూడెంటౌన్: జిల్లాకు మంజూరైన ఖేలో ఇండియా ఆర్చరీ సెంటర్‌లో శిక్షణనిచ్చేందుకు అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి టీ.సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాల కోసం ఆన్‌లైన్ నుంచి ఖేలో ఇండియా సెంటర్స్ గైడెన్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీలోపు కొత్త కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న యువజన జిల్లా క్రీడల కార్యాలయం(జీ–19)లో దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా అందించాలని కోరారు.

నేడు నీట్ పీజీ–2023

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నీట్ పీజీ–2023 పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనుంది. 96 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, ఉదయం 7 నుంచి 8:30 గంటల మధ్య అభ్యర్థులను అనుమతించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: మహిళలు స్వశక్తితో ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి. భానుమతి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదిని నియమించుకోలేనివారు ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనినా మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా మహిళల ఆహారం, ఆరోగ్యం, భద్రతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, న్యాయవాది లక్కినేని సత్యనారాయణ, గాదె సునంద, మునిగడప వెంకటేశ్వర్లు, భానుప్రియ, కాసాని రమేష్, మెండు రాజమల్లు, తోట మల్లేశ్వరావు, ఎంపీపీ బాదావత్ శాంతి, సాదిక్‌పాషా, మునిగడప పద్మ, సత్యభామ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు



మాట్లాడుతున్న షీ టీం అధికారి రమాదేవి

కొత్తగూడెంఅర్బన్: సమస్యలకు పరిష్కారం ఆత్మహత్యలు చేసుకోవడం కాదని షీ టీం జిల్లా పోలీసు అధికారి రమాదేవి తెలిపారు. శనివారం రామవరం సుభాష్‌చంద్రబోస్‌నగర్ మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో షీ టీం ఆధ్వర్యాన ర్యాగింగ్, ఆత్మహత్యలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ పేరుతో, చదువుల ఒత్తిడి, మరి ఏ ఇతర కారణాలు వల్ల కానీ ఆత్మహత్యలు చేసుకోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎవరైనా ఒత్తిడికి గురైతే పెద్దలు, ఉపాధ్యాయులు, పోలీసు శాఖను సంప్రదించాలని లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ జబ్బార్, హెచ్ఎం పర్వీన్ సుల్తానా, శిరీషా, ఖాజా, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భారత్ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా పవన్‌నాయక్



పవన్ నాయక్

మణుగూరుటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారత్ జాగృతి నూతన అధ్యక్షుడిగా బానోత్ పవన్‌నాయక్ నియమితులయ్యారు. భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్‌చారి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌నాయక్ మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ.. సంస్థ బలోపేతానికి, ఆశయాల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

దమ్మపేట : పదిహేనేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసులు కథనం ప్రకారం.. మండలానికి చెందిన ఓ బాలిక స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కాగా, ఈ పాఠశాలలో గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆ బాలిక పాల్గొనగా ఓ వ్యక్తి వీడియో తీశాడు. ఈ వీడియో కోసం సదరు వ్యక్తి బాలిక అడుగుతుండగా.. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో బాధిత చిన్నారి ఇటీవల తల్లిదండ్రులకు చెప్పగా.. శనివారం పోలీసులను ఆశ్రయించగా.. ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై..

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన ఓ యువకుడి అదృశ్యంపై స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై బి.తిరుపతిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోగుల గోపాల్‌రావు కుమారుడు నరసింహారావు అనే యువకుడు గత నెల 25వ తేదీన బ్యాంకు పని నిమిత్తం జూలూరుపాడు వెళ్లాడు. అదే రోజు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో నరసింహారావుకు కాల్ చేయగా.. అందుబాటులో లేకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీయగా ఆచూకీ ఎక్కడా లభించలేదు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైర్ల చోరీపై..

పాల్వంచరూరల్: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్, కాపర్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురంలోని తోగ్గూడెం వైపు వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన సుమారు రూ.15వేల విలువ గల 5 కేజీల కాపర్(రాగి) వైరును నవంబర్‌లో చోరీ చేశారు. ఈ ఘటన పై లైన్‌మెన్ బానోతు తులసియా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక, రెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల కిన్నెరసాని వాగు ఒడ్డున గల 12 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్ల చోరీపై శనివారం బాధిత రైతు ఎస్.రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కోసం వచ్చి మృత్యువాత

మధిర: ఉపాధి నిమిత్తం వచ్చి స్వగ్రామానికి పయనమైన ఓ మహిళ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందింది. మధిర రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గుంజువాహికి చెందిన పలువురు కూలీలు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం లింగాలలో మిర్చి కోతలకు వచ్చారు. రెండు నెలల అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు శనివారం మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈక్రమంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా బరుబై బాపూజీ రౌత్(49) ప్రమాదవశాత్తు జారి ప్లాట్‌ఫాంపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఈ సారైనా నెరవేరేనా..?

పీఎం ఈజీపీలో ఏటా ఇదే పరిస్థితి

- అవగాహన లేక తగ్గుతున్న దరఖాస్తులు
- ఎంపికలోనూ అధికారుల నిర్లక్ష్యం
- నేటికి రూ.337.63 లక్షల సబ్సిడీ మంజూరు
- యువతకు దక్కని రుణాలు



పరిశ్రమల కార్యాలయం ఇదే..

కొత్తగూడెంరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎం ఈజీపీ), ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో జిల్లాకు కేటాయించిన లక్ష్యం నెరవేరటం లేదు. రోజురోజుకు నిరుద్యోగులు పెరుగుతున్నా.. రుణాలపై అవగాహన లోపం కారణంగా అనేక మంది యువతీ, యువకులకు స్వయం ఉపాధి లభించక విడుదలైన సబ్సిడీ అందని దాక్షగానే మారింది. జిల్లా ఏర్పడినా నాటి నుంచి పీఎం ఈజీపీ పథకం కింద కేటాయించిన రుణాలు వంద శాతం గ్రౌండింగ్ కావటంలేదు. అధికారుల నిర్లక్ష్య కారణంగా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగా హన కల్పించలేకపోతున్నారు. ఈ పథకం కూడా బ్యాంకు సహకారంతో ఉంటేనే ఈ రుణం వస్తుంది. జిల్లాలోని రూరల్ ప్రాంతాలకు చెందిన అన్ని కులాల వారికి 35 శాతం, ఓసీ మెన్స్‌కు 25 శాతం సబ్సిడీ లభించగా, అర్బన్ ప్రాంతాలకు చెందిన అన్ని కులాలకు 25 శాతం, ఓసీ మెన్స్‌కు 15 శాతం మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది.

ఏటా మార్చి, ఏప్రిల్‌లో దరఖాస్తులు..



జిల్లాలో 18 ఏళ్లు నిండిన అన్ని కులాలకు చెందిన యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందటానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతి ఫేయిల్ అయినవారికి, ఏమి చదువులేని వారు పరిశ్రమలపై అవగాహన కలిగి ఉండి దరఖాస్తు చేసుకుంటే ఈ పథకం ద్వారా రూ.5 లక్షల రుణం పొందవచ్చు. జిల్లాలో సభలు ఏర్పాటు చేసి పీఎం ఈజీపీ కోసం పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న వారి సివిల్ స్కోర్ సరిగా ఉండి, బ్యాంకు అధికారులు ఇబ్బంది పెడితే, తమకు సమాచారం అందించడం వల్ల వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

– సీతారాములు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్

తయారీ యూనిట్లకు మాత్రమే...

జిల్లాలో తయారీ యూనిట్లు అయిన రైస్ మిల్లు, పప్పు మిల్లు, బ్రిక్స్, పేపర్ పేట్లు, గ్లాసులు, తయారీ రంగాలకు మాత్రమే రూ.50 లక్షల రుణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇందులో బ్యాంకు లోన్ 95 శాతం, రుణాల దరఖాస్తు చేసుకున్న వారి వాటా ఐదు శాతం ఉంటుంది. మిగతా వంద శాతంలో 30 శాతం సబ్సిడీ వర్తిస్తుంది..

జిల్లాకు కేటాయించిన యూనిట్ల వివరాలిలా..

సంవత్సరం	యూనిట్ల లక్ష్యం	మంజూరు	గ్రౌండింగ్ అయినవి	సబ్సిడీ (రూ.లక్షల్లో)	విడుదలైన రుణాలు(శాతం)
2017–18	18	10	05	08.37	55.55
2018–19	24	13	16	41.56	66.66
2019–20	34	34	33	58.69	97.05
2020–21	26	16	18	60.25	69.23
2021–22	35	34	26	79.49	74.28
2022–23	30	52	26	89.27	86.00
మొత్తం	167	159	124	337.63	74.79

జిల్లాలో 2019– 20 ఆర్థిక సంవత్సరం మాత్రమే 97.05 శాతం రుణాలు ఇచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో యువతీ, యువకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో మిగత సంవత్సరాలు లక్ష్యాన్ని పూర్తి చేరుకోలేకపోయింది. దీంతో ప్రతి ఏటా తమకు రావాల్సిన రుణాలు తీసుకోలేకపోతున్నామని, యువతీ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘డబుల్’ ఇళ్ల అవినీతిపై విచారణ జరపాలి



ధర్నా చేస్తున్న ప్రజలు, నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల జరిగిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అవినీతిపై ఏసీబీ విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని 21, 22వ వార్డులకు చెందిన బాధితులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో వారు పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. డబుల్ ఇళ్ల కేటాయింపులో పెద్ద ఎత్తున అవినీతి జరిగి ఒక్కో ఇంటికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారని ఆరోపించారు. వార్డు కౌన్సిలర్ భర్త రూ.లక్ష అడిగిన ఆడియో బయటకు వచ్చినా.. నేటికి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు లాటరీలో వచ్చిన పేర్లలో అనర్హులుంటే తొలగించి అర్హులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకురాలు వీణ, బాధితులు ఠాకూర్ వాణి, భూక్య రామ, సాయమున్నీసా, షాకిరాబేగం, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

స్పందన రాకపోతే నిరసనలు ఉధృతం



నిరసన వ్యక్తం చేస్తున్న కేటీపీఎస్ ఉద్యోగులు

పాల్వంచరూరల్: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాండురంగాపురం అంబేడ్కర్ సెంటర్‌లో కేటీపీఎస్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్, ఆర్టిజన్ కార్మికల సమస్యల పరిష్కారం కోసం మేనేజ్‌మెంట్ ఈ నెల 6వ తేదీన చర్చలకు పిలిచిందని తెలిపారు. ఈ చర్చల్లో మేనేజ్‌మెంట్ నుంచి సానుకూలంగా స్పందన రాకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మజీ, శ్రీనివాస్, రాజేందర్, మజీద్, మహేష్, అఖిలేష్‌రెడ్డి, గిరిధర్, సీతారాంరెడ్డి, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, నర్సింహారావు, నాగయ్య, రవీందర్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సయ్యాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మాత్రలు మింగిన చిన్నారి



మాత్రలు మింగిన చిన్నారి పల్లవి

నేలకొండపల్లి: ఓ చిన్నారి ఇంట్లో ఆడుకుంటూ... కుటుంబ సభ్యులు వేసుకునే మాత్రలను ప్రమాదవశాత్తు మింగింది. ఈ విషయాన్ని గుర్తించి తల్లిదండ్రులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లిన ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ శివాజీ–శ్రీదేవి దంపతులు మూడేళ్ల కుమార్తె పల్లవి శనివారం రాత్రి ఇంట్లో ఆడుకుంటూ కుటుంబ సభ్యులు ఉపయోగించే మాత్రలు చేతికందడంతో నాలుగింటిని మింగింది. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసిన సిబ్బంది ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. అయితే, 108కు సమాచారం ఇచ్చి వేచిచూసినా రాకపోవడంతో బైక్‌పై ఖమ్మం తీసుకెళ్లారు. ప్రస్తుతం ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో పాపకు చికిత్స జరుగుతోందని తల్లిదండ్రులు తెలిపారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన





వేడుకకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవలలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

71 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: ఒడిశా రాష్ట్రం నుంచి క్రమంగా తరలిస్తున్న నిషేదిత గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.రాజు వివరాలను వెల్లడించారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీ జనార్దనరెడ్డి, ఏసీ గణేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని బిడ్జి సెంటర్‌లోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఒక కారు, ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేయగా రెండింటిలో కలిపి సుమారు 71 కిలోల గంజాయి లభించింది. దీంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గణేష్ సికిందర్, క్రిష్ణపాద్ బైరాగి, మహేష్ రెడ్డి, అమర్‌నాథ్‌పటేల్‌లను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. అనంతరం వీరిని విచారించగా.. ఒడిశాలోని మల్కనగిరిలో సుమారు రూ.14లక్షల విలువైన గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె. రహీమున్నిషా బేగం, ఎస్సై ఎస్‌కె. ముబషీర్ అహ్మద్, గౌతమ్, సిబ్బంది కరీం, బాలు, హబీబ్, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు తదిరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాలో రామచంద్రాపురం వాసులు..

అశ్వాపురం: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తూ.. పోలీసులకు పట్టుబడుతున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాలో అశ్వాపురం మండల వాసులు ఉంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి ముఠాలో ఒకరు అశ్వాపురంకు చెందిన వ్యక్తి కాగా మరొకరు రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన వాడు. అంతేకాక ఈ నెల 3న నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులో పట్టుబడిన వారిలో ఒకరు అశ్వాపురం మండలం రామచంద్రాపురంకు చెందివాడు కాగా, మరొకరు పరారీలో ఉన్నాడు. వీరితో పాటు రామచంద్రాపురం, సత్యనారాణపురం గ్రామాల నుంచి చాలా మంది గుట్టుగా గంజాయి అక్రమ రవాణాలో పాటుపంచుకుంటున్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరు హైదరాబాద్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాతో కలిసి గత కొంత కాలంగా గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్న వారిని గుర్తించి గ్రామాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన విజయ్

పాల్వంచరూరల్: రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన పాల్వంచ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన మాలోతు విజయ్(25) పేయింటర్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఇందిరకాలనీ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో భద్రాచలం నుంచి నల్గొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయలైన విజయ్‌ను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

కిరాణం వ్యాపారి..

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రానికి చెందిన కిరాణం వ్యాపారి దమ్మాలపాటి నాగమణి (40) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈమె భర్త శ్యామ్‌సుందర్ గత ఏడాది ఫిబ్రవరి 11న అనారోగ్యంతో మృతి చెందాడు. వీరి ఏకైక కుమార్తె శ్రీప్రత్యూషకు జనవరి 27న వివాహం చేశారు. భర్త చనిపోయిన సంవత్సరానికే భార్య కూడా చనిపోవడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: భార్యభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగా భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పునుకుల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పునుకుల గ్రామానికి చెందిన గుగులోత్ వెంకటేశ్వర్లు(28), భార్యతో రెండు రోజులుగా గొడవ పడుతున్నాడు. ఈక్రమంలో శనివారం ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడిపోగా స్థానికులు పాల్వంచలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేయగా తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి ‘ఎడ్లబండి’ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడులో జరుగుతున్న శ్రీఅంకమ్మ తల్లి, శ్రీఅక్కమ్మ, పేరంటాళ్ల శ్రీరామలింగయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా శనివారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి ఎడ్లబండి లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 15 జట్లు పాల్గొనగా, బనిగండ్లపాడుకు తల్లపురెడ్డి అంకాల రెడ్డి, ఏపీలోని బాపట్ల జిల్లా వేమినేనివారిపాలెంనకు చెందిన నాగరాజు, కృష్ణ, అనిగండ్లపాడుకు మల్లికేసరి కృష్ణకు చెందిన పశువులు వరుసగా నాలుగు బహుమతులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డితో పాటు యన్నం సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, శీలం వెంకటేశ్వరరెడ్డి, గూడూరు శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కందుకూరులో..

వేంసూరు: మండలంలోని కందుకూరులో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు ఆదివారం మొదలుకానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు మందపాటి వెంకటరెడ్డి, బండి జగదీశ్‌రెడ్డి తెలిపారు. అలాగే, ఆదివారం నుంచే రెండు రాష్ట్రాలస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు మొదలవుతాయని సభ్యుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

క్లుప్తంగా...

‘అపాచీ’ మరో 100 మిలియన్ డాలర్లు

10 వేల ఉద్యోగాల కల్పన



(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు అపాచీ ఇండియా డైరెక్టర్ సెర్గియో లీ వెల్లడించారు. మరో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తద్వారా 10 వేల ఉద్యోగాలను కల్పించనున్నట్లు చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపాచీకి చైనా, భారత్, వియత్నాంలో ప్లాంట్లు ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్లాంటే అతి పెద్దదని వివరించారు. ఏపీలో ప్లాంట్‌పై ఇప్పటిదాకా 100 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అత్యంత తక్కువ వ్యవధిలోనే తమకు అనుమతులు లభించినట్లు గుర్తు చేసుకున్నారు. సింగిల్ విండో క్లియరెన్స్‌తో పాటు సంస్థ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును ప్రభుత్వం అందించిందన్నారు. వైఎస్సార్ దార్శనికతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తోందని ప్రశంసించారు.

ఆరోగ్య రంగంలో ఆదర్శ రాష్ట్రం

డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి



హెల్త్‌కేర్ విభాగంలో దేశానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఔషధ రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు సానుకూలాంశాలతో పెట్టుబడులకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోందని చెప్పారు. పారిశ్రామికంగానే కాకుండా రాష్ట్రం సామాజికంగా పురోగమించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో రాష్ట్రం వివిధ రంగాల్లో పటిష్టంగా ముందుకెళుతోందని ప్రశంసించారు. లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు) రంగంలో భారత్‌కు అపార వ్యాపార అవకాశాలున్నాయని సతీష్‌రెడ్డి తెలిపారు. మెడ్‌టెక్ జోన్‌తో మరిన్ని పెట్టుబడుల రాకకు అవకాశాలున్నాయని ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పెట్టుబడుల సదస్సు సూపర్ హిట్

దేశ పారిశ్రామిక దిక్సూచి ఏపీ అంటూ కార్పొరేట్ దిగ్గజాల ప్రశంసలు

- రెండు రోజుల్లో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు
- 378 ఒప్పందాల ద్వారా 6.09 లక్షల మందికి ఉపాధి
- రెండవ రోజు రూ.3,841 కోట్ల విలువైన 14 యూనిట్లు ప్రారంభం
- ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తేవడానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని అపారమైన అవకాశాలను వివరిస్తూ ‘అడ్వాంటేజ్ ఏపీ’పేరుతో విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ హిట్ అయ్యింది. దేశ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు ఒకే వేదికపైకి రావడమే కాకుండా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులను పెడుతూ ఒప్పందాలు చేసుకున్నారు. రెండు రోజుల సమావేశాలకు రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముఖేష్ అంబానీతో పాటు కరణ్ అదానీ, జిందాల్, భంగర్, ఒబెరాయ్, భజాంకా, దాల్మియా, మిట్టల్, జీఎంరావు, కృష్ణ ఎల్లా, అపోలో ప్రీతారెడ్డి, సతీష్ రెడ్డి, బీవీఆర్ మోహన్ రెడ్డి, మషాహిరో యమాగుచి, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్ వంటి 30కిపైగా కార్పొరేట్ దిగ్గజాలు హాజరయ్యారు. అంబానీ మొదలు రాష్ట్రంలోని పారిశ్రామికవేత్త వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చుకోవడమే కాకుండా అందులో భాగస్వామ్యమవుతామంటూ ప్రకటించారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో 20 రంగాల నుంచి రూ.13,41,734 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. 378 ఒప్పందాల ద్వారా రాష్ట్ర యువతకు ప్రత్యక్షంగా 6,09,868 ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గత ప్రభుత్వాల వలే ప్రచారం కోసం ఒప్పందాలు కుదుర్చుకొని వదిలేయకుండా వాటిని తక్షణం అమల్లోకి తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి.. సీఎస్ అధ్యక్షతన ఒప్పందాల పర్యవేక్షణ కమిటీ వేశారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఒప్పందాల అమలు తీరు, అనుమతుల మంజూరు వంటి అంశాలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటుందని సీఎం ప్రకటించడంపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్థవంతమైన చర్చలు

ఈ సమావేశాల సందర్భంగా 15 రంగాలపై అర్థవంతమైన చర్చలు జరిగాయి. ఇందులో ఆయా రంగాలకు చెందిన 100 మందికిపైగా ప్రముఖ నిపుణులు పాల్గొని చర్చించారు. పలు దేశాల్లో ఉన్న పరస్పర పెట్టుబడుల అవకాశాలపై వియత్నాం, నెదర్లాండ్స్, యూఏఈ, వెస్ట్రన్ ఆస్ట్రేలియా దేశాలతో కంట్రీసెషన్స్ జరిగాయి. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వివిధ అంశాలపై చర్చలు జరిపారు. రాష్ట్రంలోని పెట్టుబడులు, ఉత్పత్తులు, ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేలా 137 స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఒక జిల్లా ఒక ఉత్పత్తి పేరుతో జిల్లాల వారీగా ఎగుమతులను ప్రోత్సహిస్తున్న ఉత్పత్తుల స్టాల్ విశేషంగా ఆకర్షించింది. 25 దేశాల నుంచి 46 మంది రాయబారులతో పాటు మొత్తం 14,000కు పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

14 యూనిట్లు ప్రారంభం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రాష్ట్రంలో వాణిజ్యపరంగా ఉత్పత్తికి సిద్ధమైన 14 యూనిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శరబానంద సోనావాల్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ యూనిట్ల ప్రారంభం ద్వారా రూ.3,841 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపంలోకి రావడమే కాకుండా 9,108 మందికి ఉపాధి లభించనుంది. క్లింబెర్లీ క్లార్క్, బ్లూస్టార్, అంబర్, హావెల్స్, ఎక్సలెంట్ ఫార్మా, ఎస్‌జీసీ టాన్స్‌మిషన్స్, చార్ట్ ఇండస్ట్రీస్, లారస్ ల్యాబ్, అమరా లైఫ్, శారదా ఫెర్రో అల్లాయిస్, విన్‌విన్ స్పెషాలిటీ, ఏవోవీ ఆగ్రో ఫుడ్స్, ఎస్‌హెచ్ ఫుడ్, అవేరా కంపెనీలున్నాయి.

‘దివీస్’ మరో రెండు ప్లాంట్లు

సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడి



ఫార్మా దిగ్గజం దివీస్ ల్యాబొరేటరీస్ ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు యూనిట్లు నెలకొల్పనుంది. ఇందుకు దాదాపు రూ.1,480 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే రూ.780 కోట్ల ప్రతిపాదన ఆమోదం పొందగా కొత్తగా మరో రూ.700 కోట్ల ప్రతిపాదనలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అదనంగా 22 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందని దివీస్ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు వెల్లడించారు. కాకినాడలో రెండో దశ కింద ఒక యూనిట్, కృష్ణపట్నం దగ్గర మరొక దివీస్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి ఎగుమతి ఆధారిత యూనిట్లుగా (ఈవోయూ) ఉంటాయని వివరించారు. కొన్ని సమస్యల వల్ల కాకినాడ యూనిట్ పనులు గతంలో ముందుకు సాగలేదని, అవి పరిష్కారం కావడంతో రెండో దశ పనులు చేపట్టడానికి మార్గం సుగమమైందని చెప్పారు. మిగతా ప్రక్రియ పూర్తయితే రెండేళ్లలోగా ఇది అందుబాటులోకి వస్తుందని తెలిపారు.



హెటిరో గ్రూప్ ఎండీ డాక్టర్ బండి వంశీ కృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న కిషన్ రెడ్డి, సీఎం జగన్

రెండేళ్లలో రూ. రెండు వేల కోట్లు

భారత్‌ను ఫార్మా స్యూటికల్ రంగంలో భాగస్వామిగా చేసుకునేందుకు అనేక దేశాలు పోటీ పడుతున్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇప్పటికే ఫార్మా రంగంలో ఏపీ తనదైన ముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, చూపిస్తున్న చొరవ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం కారణంగా ఏపీ వైపు చూస్తున్నాం. రాబోయే రెండేళ్లలో ఏపీలో రూ.2 వేల కోట్లు పెట్టుబడులు పెడతాం. దీని ద్వారా కనీసం 3,000 మందికి ఉపాధి లభిస్తుంది.

– వంశీకృష్ణ బండి,
హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ

మహిళా సాధికారతపై మరింత దృష్టి: సుచిత్రా ఎల్లా



మహిళా వ్యాపారవేత్తల సాధికారతపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) మరింతగా దృష్టి పెడుతోందని భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా తెలిపారు. ఇందుకోసం మరిన్ని సీఐఐ చాప్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ విషయాలు చెప్పారు. స్వల్ప వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో అత్యంత వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని సుచిత్రా ఎల్లా తెలిపారు. ఈ నేపథ్యంలో పలు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అభినందించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికి సీఐఐ నుంచి పూర్తిస్థాయిలోతోడ్పాటు అందిస్తామని సుచిత్రా ఎల్లా చెప్పారు.

పారిశ్రామిక హబ్‌గా ఏపీ

రాష్ట్రం పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానం

- జీఐఎస్ ముగింపు సమావేశంలో సీఎం వైఎస్ జగన్



విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు రాష్ట్రాన్ని ఆకర్షణీయ గమ్యస్థానంగా నిలుపుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల వృద్ధికి కృతనిశ్చయంతో ఉన్న తమ ప్రభుత్వం.. అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పిస్తుందని పారిశ్రామికవేత్తలకు భరోసా నిచ్చారు. కరోనా ప్రతికూల పరిస్థితులను ఎదురొడ్డి మూడున్నరేళ్లలో ఆర్థికాభివృద్ధి సాధించడం తమ ప్రభుత్వ ఘనత అని చెప్పారు. కీలక సమయంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన 378 ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో 6.09 లక్షల మందికి ఉద్యోగాలు లభించనుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల మేరకు పరిశ్రమలను స్థాపించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ‘గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023’రెండవ రోజు శనివారం ముగింపు సమావేశంలో దేశీయ, అంతర్జాతీయ అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- అత్యంత కీలక సమయంలో ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహించాం. దేశ, విదేశీ పారిశ్రామికవేత్తల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను అనుకూల గమ్యస్థానంగా నిలపడంలో ఈ సమ్మిట్ విజయం సాధించింది.
- ఆటోమొబైల్, ఈవీ సెక్టార్, హెల్త్ కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, అగ్రి ప్రాసెసింగ్, టూరిజం తదితర రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను సదస్సులో విశదీకరించారు. మరిన్ని రంగాల్లో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలను అన్వేషించేందుకు యూఏఈ, నెదర్లాండ్స్, వియత్నాం, వెస్ట్రన్ ఆస్ట్రేలియాలను భాగస్వాములుగా చేసుకుని మరో నాలుగు సెషన్లు కూడా నిర్వహించాం.
- రెండు రోజుల సదస్సులో రూ.13,41,734 కోట్ల విలువైన పెట్టుబడులతో 378 ఎంఓయూలు కుదిరాయి. వీటి వల్ల మొత్తం 6,09,868 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఐటీ, ఐటీ ఆధారిత రంగాలకు సంబంధించి 82 ఒప్పందాలు చేసుకున్నాం. వీటి విలువ రూ.73,819 కోట్లు. దాంతో 1,40,002 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రెండో రోజు సదస్సులో భాగంగా రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులతో 286 ఎంఓయూలు చేసుకున్నాం. వీటి ద్వారా సుమారు 2.09 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
- పరిశ్రమలు స్థాపించేలా పర్యవేక్షించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసే ఈ కమిటీలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఈ సదస్సులో కుదిరిన ఎంవోయూల అమలు దిశగా చర్యలు తీసుకుంటుంది.
- రూ.3,841 కోట్లతో స్థాపించిన 14 పారిశ్రామిక యూనిట్లను ఈ సమ్మిట్ వేదిక నుంచి ప్రారంభించాం. వాటితో 9,108 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కింబర్లే క్లార్క్, బ్లూస్టార్, క్లెమాటిక్, లారస్ ల్యాబ్, హేవెల్స్ ఇండియా, శారదా మెటల్స్, అల్లాయిస్ తదితర కంపెనీలు ఈ పెట్టుబడులు పెట్టాయి.

ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఏపీకి అపార అవకాశాలు

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి): ఆత్మనిర్భర్ భారత్ విధానంలో భాగంగా కేంద్రం 14 కీలక రంగాల్లో ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాలను అమలు చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆహార ఉత్పత్తులు, వైద్య పరికరాలు మొదలైనవి వీటిలో ఉన్నాయని చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కి ఉన్న సానుకూలతల దృష్ట్యా మెరైన్ ఉత్పత్తులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు మొదలైన విభాగాల్లో వృద్ధి చెందడానికి రాష్ట్రానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయడం ద్వారా అభివృద్ధిలో ఏపీ కొత్త గరిష్ట స్థాయిలను చేరుతుందని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రాలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్న నేపథ్యంలో ఈ తరహా సహకారం కీలకంగా ఉంటుందన్నారు.

జిల్లా వార్తలు

కృష్ణుడి కల్యాణానికి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు, తలంబ్రాలతో వెళ్తున్న భక్తులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల వాసులు ఏపీలోని నెమలిలో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. యాభై ఏళ్లుగా శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి ముష్టికుంట్ల వాసులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యాన శనివారం తలంబ్రా లు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో బోయినపల్లి రాములు, రుక్మిణి, బోయినపల్లి వెంకటకృష్ణ, మురళి, వేణు, గోవర్దన్, కృష్ణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

‘హక్కుల హననంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటే..’

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ఒకే తీరుగా వ్యవహరిస్తున్నారని ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు సాదినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లోని పాలకులు కార్మికులకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రజలు, ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ శక్తులకే లాభం జరిగేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇదే సమయాన లాభాల్లో నడుస్తున్న బొగ్గు గనులను ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. కాగా, వచ్చే నెల 2, 3వ తేదీల్లో కొత్తగూడెంలో జరిగే ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు ఎల్.విశ్వనాథం, ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్, జె.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, బి.రాంసింగ్, కె.వాసు, లింగన్న, ఎల్.రవి, కొండపల్లి శ్రీనివాస్, ఎ.గట్టయ్య పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

నేలకొండపల్లి: అనుమతి లేకుండా తరలిస్తున్న పేలుడు పదార్థాలను నేలకొండపల్లి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట నుంచి నేలకొండపల్లికి డీసీఎంలో పేలుడు పదార్థాలు తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రెండు బాక్స్‌ల డిటోనేటర్లు, ఐదు బాక్స్‌ల జిలిటన్ స్టిక్స్, 64బాక్స్‌ల పవర్ బూస్టర్లను స్వాధీనం చేసుకుని ఆర్.నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్సై జి.ప్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా రూ.2,710 కోట్ల లావాదేవీలు

- రాష్ట్రంలోనే ఖమ్మం రెండో స్థానం
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ నర్మద, జీఎం పద్మావతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అభివృద్ధి పథంలో దూసుకెళ్తూ లావాదేవీలు, రుణాల పంపిణీలో రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందని చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. డీసీసీబీ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న ఖమ్మం డీసీసీబీ 50 బ్రాంచ్‌లతో వివిధ వర్గాల ప్రజలకు సేవలందిస్తోందని తెలిపారు. వ్యవసాయ, విద్యా, గృహ, మార్టిగేజ్, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, వ్యవసాయ యాంత్రీకరణ, ఎస్‌హెచ్‌జీ, చిన్న పరిశ్రమలు, పీఎంఈజీపీ తదితర రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. రూ.2,710 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలోనే ఖమ్మం డీసీసీబీ రెండో స్థానంలో నిలుస్తుండగా, రూ.1,032 కోట్ల డిపాజిట్లు, రూ.1,678 కోట్ల రుణాలతో కొనసాగుతోందని వెల్లడించారు. వ్యవసాయ రుణాలుగా రూ.916.78 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.371.03 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.85.16 కోట్లు, ఎస్‌హెచ్‌జీ రుణాలు రూ.15.06 కోట్లు, రైతుల పిల్లలు ఉన్నత, విదేశీ చదువులకు రూ.63.56 కోట్లు రుణాలు ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. ఇక గృహ రుణాలకు కూడా ప్రాధాన్యమిస్తూ మూడేళ్లలో రూ.15.68 కోట్ల మేర రుణాలు ఇచ్చినట్లు చెప్పారు.

‘సహకార మిత్ర’కు ఆదరణ

ఈ ఏడాది ప్రజలకు ప్రయోజనం కలిగేలా సహకార మిత్ర డిపాజిట్ పథకాన్ని అమలు చేశామని చైర్మన్ నాగభూషణం తెలిపారు. 333 రోజుల పరిమితితో కూడిన ఈ పథకాన్ని ప్రజలు ఆదరించగా రూ.53.41 కోట్లు డిపాజిట్లు సమకూరాయన్నారు. త్వరలోనే బ్యాంక్ టర్నోవర్‌ను రూ.3 వేల కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక పీఏసీఎస్‌లకు సీఎం కేసీఆర్ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయడంతో ఉద్యోగులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో బ్యాంక్, పీఏసీఎస్‌ల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బ్యాంక్ ఇన్‌చార్జ్ సీఈఓ నర్మద, జనరల్ మేనేజర్ పద్మావతి పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో విద్యార్థుల్లో విభజన

ఖమ్మంమయూరిసెంటర్: నూతన జాతీయ విద్యా విధానంలో మధ్యయుగం చరిత్రను పాఠ్యాంశాలుగా చేరుస్తున్నారని, తద్వారా వర్ణ వ్యవస్థకు జవసత్వాలు అందించి లబ్ధి పొందాలని పాలకులు కుట్ర పన్నారని ప్రొఫెసర్ ఖాసీం విమర్శించారు. అంతే కాక ఈ విధానంతో విద్యార్థుల్లో విభజన జరుగుతుందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఖమ్మంలో శనివారం ‘జాతీయ నూతన విద్యా విధానం – విద్యా వ్యవస్థపై ప్రభావం’ అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సమాజాన్ని చైతన్యపరిచేది, నడిపించగలిగేది, మార్పు తీసుకొచ్చేది విద్యార్థులేనని చెప్పారు. కానీ, పాఠ్యాంశాల్లో 70 శాతం వ్యవసాయం, ఆ తర్వాత పారిశ్రామిక, శాస్త్రీయ అవగాహన పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని కొఠారి కమిషన్ సూచించినా అమలు కాలేదన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ హయాంలో వచ్చిన విద్యావిధానం ద్వారా డబ్బుతో కొందరికే చదువు అందే ప్రక్రియ మొదలైందని చెప్పారు. ఇక ప్రస్తుత పాలకులు తీసుకురావాలని భావిస్తున్న విద్యావిధానాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలవాదులు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిపతులు, విదేశీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రూపొందించడంతో ప్రభుత్వ విద్య మరింత నిర్వీర్యం కానుందని ఖాసీం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులు దీనిని వ్యతిరేకించాలని సూచించారు. తొలుత ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, శింగు నర్సింహారావు, సీహెచ్ సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, పుట్టా లక్ష్మణ్, సిద్ధినేని కర్ణకుమార్, కోట రామాంజనేయులు, మడుపల్లి లక్ష్మణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

మాయమాటలతో గారడీ చేస్తున్న ప్రభుత్వం

- హామీలకే పరిమితమవుతున్న కేసీఆర్ మాటలు
- క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కనకయ్య

బయ్యారం: మాయమాటలతో గారడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఏర్పాటుచేసిన క్యాంపు కార్యాలయాన్ని శనివారం పొంగులేటి, భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం పథకాలు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతుల రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు, విద్యార్థులకు భరోసా, దళితులకు మూడెకరాల భూమి తదితర హామీలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని సూచించారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా తాము ప్రజల మధ్యే ఉంటున్నామని, రానున్న రోజుల్లో సైతం నమ్ముకున్న వారి కోసం ప్రజల ఆశీస్సులతో ముందుకు నడుస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, గార్ల జెడ్పీటీసీ సభ్యురాలు ఝాన్సీ, నాయకులు బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, భద్రయ్య, సత్తిరెడ్డి, వెంకటేశ్వరరావు, గోపాల్, వెంకటరమణ, శ్రీను, సుమన్, రామారావు, మురళి, సీత్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు చినతిరుపతి ముస్తాబు



కొండల నడుమ కొలువైన స్వామి కోవెల
(ఇన్‌సెట్) ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

- నేటి నుంచి నర్సింహులపేటలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- ఐదు జిల్లాల నుంచి రానున్న భక్తులు

నర్సింహులపేట: చుట్టూ అందమైన కొండలు, కొండల నడుమ కోవెల.. ఆ కోవెలలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి. తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పోలినట్లుగా కొండపై వెలిసిన వేంకటేశ్వరుడు. తిరుపతికి వెళ్లలేని భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. చిన తిరుపతిగా పేరుగాంచిన ఈ దేవాలయం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఉండగా.. ఆదివారం నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గిరిజనులు ఎక్కువగా ఉన్న డోర్నకల్ నియోజకవర్గంలోని నర్సింహులపేటలో వెలసిన వేంకటేశ్వరుడిని వారు బాలాజీగా పూజిస్తారు. మహబూబాబాద్ జిల్లా నుంచే కాకుండా సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్, హనుమకొండ తదితర జిల్లాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు వస్తారు.

హోలీ రోజున కల్యాణం

ఏటా ఈ ఆలయంలో హోలీ రోజున రాత్రి పద్మావతి – వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుంది. ఆదివారం మొదలయ్యే బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ఈ సారి 7వ తేదీ మంగళవారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనుడగా, 350 మంది జంటలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 8 గంటలకు తొళక్కం, సేవాకాలం, 6న బిందె తీర్థం, రాత్రి పరమపథోత్సవం, తీర్థప్రసాదగోష్టి, 7వ తేదీన పుణ్యావాచనం, అంకురార్పణం, ధ్వజారోహణం, భేరిపూజ, హోమం, రాత్రి 8 గంటలకు కల్యాణం, 8న హోమం బలిహరణం, పురవీధి సేవ, 9వ తేదీన పూర్ణాహుతి ధ్వజపట ఉద్వాసన, చక్రతీర్థం, ఏకాంత సేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. కాగా, పెద్దసంఖ్యలో హాజరుకానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వేణుగోపాల్, చైర్మన్ రమేశ్ తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐల సేవలు ప్రశంసనీయం

భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్



మాట్లాడుతున్న ఏఎస్పీ పారితోష్ పంకజ్

భద్రాచలం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. భద్రాచలంలోని శిశుమందిర్ పాఠశాలకు ప్రవాసాంధ్రుల ఆధ్వర్యాన శనివారం రూ.15 లక్షల వ్యయంతో స్పోర్ట్స్, ల్యాబ్ పరికరాలు, పుస్తకాలు, ఫర్నిచర్, ప్రొజెక్టర్, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ అందజేశారు. అలాగే, ఏటా 33 మంది విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించి వారి పుస్తకాలు, ఇతర అవసరాల కోసం రూ.9 లక్షలను యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఏఎస్పీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడి స్వస్థలానికి సేవలదిస్తుండటం అభినందనీయమన్నారు. దాతల చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, ప్రవాసాంధ్రులు రంగా శ్రీరాం, లక్ష్మీ కాంబోజి, సునీత రాచపల్లి, సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర కార్యదర్శి సీతారాములుతోపాటు పాకాల దుర్గాప్రసాద్, గట్టు వెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.